క్లుప్తంగా

విస్తృతంగా వాహనాల తనిఖీ



ద్విచక్ర వాహన వివరాలు తెలుసుకుంటున్న ఎస్‌ఐ నేతాజీ, సిబ్బంది

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని పలు ముఖ్య కూడళ్లలో గురువారం మల్కాపురం పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. సీఐ గొలగాని అప్పారావు ఆదేశాల మేరకు ఎస్‌ఐ నేతాజీ ఉదయం 6 గంటల సమయంలో సిబ్బందితో కలిసి మల్కాపురం, ప్రకాష్‌నగర్, ఏడు గుడుల సెంటర్ ఏరియాల్లో వాహనాలను ఆపి వాటి పత్రాలను పరిశీలించారు. పత్రాలు సరిగ్గా లేని వాహనాలను స్టేషన్‌కు తరలించారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా అరికట్టే కార్యక్రమంలో భాగంగా స్పెషల్ డ్రైవ్ ద్వారా వాహనాలు తనిఖీ చేశామని ఎస్‌ఐ నేతాజీ తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న నాయకులు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు ములగాడ నుంచి శ్రావణ్ షిప్పింగ్ మీదుగా మారుతి సర్కిల్ వైపు వెళ్లే సీసీ రోడ్డు నిర్మాణ పనులకు గురువారం శంకుస్థాపన జరిగింది. విశాఖ పోర్టు అధికారులు, వార్డు కూటమి నాయకులు కలిసి భూమిపూజ చేశారు. ఈ మార్గం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని రాకపోకలు సాగించే వీలు లేకుండా పోయింది. ఈ సమస్యపై ఎమ్మెల్యే పోర్టు అధికారులతో మాట్లాడటంతో, వారు స్పందించి సీసీ రోడ్డు నిర్మించేందుకు ముందుకొచ్చారు. దీనికి సంబంధించిన పనులు ప్రారంభమయ్యాయి.

రామాలయంలో కోలాటం



కోలాటంలో పాల్గొన్న రాజేశ్వరి బృందం

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు శ్రీహరిపురం రామాలయంలో గురువారం కోలాట నృత్య ప్రదర్శన జరిగింది. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా కమిటీ ఆధ్వర్యంలో రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక కోలాట నృత్య శిక్షకురాలు లోవ రాజేశ్వరి బృందం పలు కీర్తనలకు నృత్య ప్రదర్శనలు చేసి ఆకట్టుకుంది. నృత్యంలో పాల్గొన్న పలువురు మహిళలకు కమిటీ ప్రతినిధులు జ్ఞాపికలు అందించారు.

రైతుబజార్‌లో నాణ్యమైన సరకులు విక్రయించాలి

సీతంపేట: వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస కిరణ్ గురువారం నరసింహనగర్ రైతుబజార్‌లో పర్యటించారు. అన్ని స్టాళ్లు పరిశీలించారు. అన్ని రకాల కూరగాయలు వినియోగదారులకు అందుబాటులో ఉండేలా చూడాలని ఈవో కొండబాబును ఆదేశించారు. ఉల్లిపాయలు, టమాటాల కౌంటర్లను పరిశీలించి నాణ్యమైన, తాజా సరకులు విక్రయించాలని వ్యాపారులకు సూచించారు. బజారుకు వచ్చిన వినియోగదారులతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు, బజారులో ఎటువంటి మౌలిక సదుపాయాలు, మెరుగైన సేవలు అవసరమో అడిగి తెలుసుకున్నారు. రైతుబజారులో ఈవో నిర్వహిస్తున్న రికార్డులను తనిఖీ చేశారు. సహాయకుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

430 మంది విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు

సీతంపేట: జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ మీనాక్షి ఆధ్వర్యంలో గురువారం అక్కయ్యపాలెం ఎన్‌జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. 430 మంది విద్యార్థులకు పారా మెడికల్ ఆప్తాల్మిక్ ఆఫీసర్ ఆర్.సురేష్ నేత్ర వైద్య పరీక్షలు చేసి, వీరిలో 64 మందికి దృష్టిలోపం ఉన్నట్టు నిర్ధారించారు. 58 మందికి కళ్లద్దాలు అవసరమని, వారికి రాష్ట్ర ప్రభుత్వం వాటిని పంపిణీ చేస్తుందని తెలిపారు. అక్టోబరు నెలాఖరు వరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, దృష్టిలోపం ఉన్నవారికి ఉచితంగా కళ్లద్దాలు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జయంతి రాధాకుమారి, నేత్ర వైద్య శాల సిబ్బంది పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న.. కబ్జాదారులు



కనుమరుగవుతున్న చెరువు ప్రాంతం

- యథేచ్ఛగా ప్రభుత్వ స్థలాల ఆక్రమణ
- అక్రమంగా నిర్మాణాలు
- నేతల అండదండలతోనే అంటున్న స్థానికులు

గోపాలపట్నం: నేతల కళ్లు ప్రభుత్వ స్థలాలపై పడ్డాయి. ఇటీవల కాలం నుంచి వీరు కబ్జాలు మొదలు పెట్టారు. తొలి అడుగులో వీరి దృష్టి ఎర్ర చెరువుపై పడిందని పలువురు విమర్శిస్తున్నారు. జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం పరిసర ప్రాంతాల్లో కబ్జాదారులు బరి తెగిస్తున్నారు. యథేచ్ఛగా చెరువు స్థలాల్లో నిర్మాణాలు సాగిస్తున్నారు.

కనుమరుగవుతున్న ఎర్ర చెరువు..

కొత్తపాలెం మధ్యలో ఉన్న ఎర్ర చెరువు కనుమరుగయ్యే ప్రమాదంలో పడిందని పలువురు వాపోతున్నారు. భూగర్భ జలాలు పెరిగేందుకు ఈ చెరువు దోహదపడుతోందని, దీన్ని కబ్జా చేస్తే భవిష్యత్తులో నీటికి ఇబ్బందులు తప్పవని పర్యావరణ ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సుందరీకరణ పనులు ఎక్కడ?

ఎర్ర చెరువు, సంతోషినగర్ చెరువులను అభివృద్ధి చేస్తామని ఎన్నికల సమయంలో కూటమి నాయకులు హామీ ఇచ్చారు. ఇప్పుడా మాటలు మరిచారు. ఇటీవల ఈ ప్రాంతంలో పర్యటించిన ఎమ్మెల్యే గణబాబు ఎర్ర చెరువును సుందరీకరిస్తామని తెలిపారు. ఇక్కడి గట్టుపై వాకింగ్ ట్రాక్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అయితే ఇప్పుడు ఆ



చెరువు గర్భంలో నిర్మించిన పునాదులు



ఎర్ర చెరువులో ఇటీవల చేపట్టిన నిర్మాణం

పరిస్థితి కనిపించడం లేదు. చెరువుకు రెండో వైపు (చంద్రనగర్ వైపు) యథేచ్ఛగా నిర్మాణాలు సాగిస్తున్నారు. కూటమి నేతల అండదండలతోనే అవి జగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నాయకుల ఒత్తిడితోనే..

నాయకుల ఒత్తిడితోనే రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు వాపోతున్నారు. కబ్జాదారులను వారించేందుకు, నిర్మాణాలను తొలగించేందుకు సాహసించలేకపోతున్నామని పలువురు అధికారులు వాపోతున్నట్లు తెలుస్తోంది. ఇదే పరిస్థితి 89, 91, 92 వార్డుల్లో నెలకొని ఉందని పలవురు చెబుతున్నారు. సంబంధిత అధికారులు కూడా నాయకులకు వత్తాసు పలికే విధంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించి కబ్జాదారుల నుంచి చెరువులను, ప్రభుత్వ స్థలాలను రక్షించాలని పలువురు కోరుతున్నారు.



గతంలో కబ్జా చేసిన స్థలంలో వేస్తున్న పిల్లర్లు

సామాజిక భవనాలు ప్రారంభం



గుల్లలపాలెంలో భవనాన్ని ప్రారంభిస్తున్న విప్ గణబాబు, కోరమాండల్ అధికారులు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు గుల్లలపాలెంలో మహిళల కోసం నిర్మించిన సామాజిక భవనాన్ని గురువారం ప్రభుత్వ విప్ పి.గణబాబు ప్రారంభించారు. కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ తన సీఎస్సార్ నిధులు సుమారు రూ.42 లక్షలతో ఈ భవనం నిర్మించింది. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ స్థానిక మహిళ కోసం కోరమాండల్ సంస్థ ఇంత పెద్ద భవనాన్ని నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. ఇటీవల కాలంలో సంస్థ తన సీఎస్సార్ నిధుల ద్వారా పారిశ్రామిక ప్రాంతంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తోందన్నారు. కార్యక్రమ అనంతరం వార్డులోని ములగాడ వద్ద సుమారు రూ.12 లక్షలతో నిర్మించిన సామాజిక భవనాన్ని గణబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో కోరమాండల్ సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎం.జ్ఞానసుందరం, సీనియర్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ రంగకుమార్, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ కె.వి.వి.వై.ఎస్.నారాయణ, కోరమాండల్ సీఎస్ఆర్ హెడ్ జయగోపాల్, జనరల్ మేనేజర్(హెచ్ఆర్) రెడ్డిపల్లి శ్రీనివాస్, సీఎస్‌వో నారాయణపాత్రుడు, శ్రీకాంత్, శేషాపు వెంకటరమణ, కూటమి నాయకులు కోరాడ శ్రీను, అంగ దుర్గాప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే క్షయ వ్యాధి నివారణ



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

విశాఖ విద్య: క్షయ వ్యాధిపై పూర్తి అవగాహన కలిగి ఉంటేనే నివారణ సాధ్యమని బుచ్చిరాజుపాలెం పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రేవతి అన్నారు. జాతీయ క్షయ నివారణ కార్యక్రమంలో భాగంగా ప్రధాన మంత్రి టి.బి.ముక్త్, భారత్ అభియాన్ జిల్లా క్షయ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం 90వ వార్డు బుచ్చిరాజుపాలెం గవర వీధిలో వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు ఉచితంగా బీపీ, సుగర్ టెస్టులు, టీబీ కారక రక్త పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రేవతి మాట్లాడుతూ క్షయ వ్యాధిపై సరైన అవగాహన లేకపోవడం వల్ల చాలా మంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. రెండు వారాల పాటు దగ్గు, సాయంత్రం జ్వరం, ఆకలి తగ్గడం, బరువు తగ్గడం వంటివి క్షయ వ్యాధి లక్షణాలుగా గుర్తించవచ్చని తెలిపారు. ప్రాథమిక దశలోనే చికిత్స పొంది రెగ్యులర్‌గా మందులు, సరైన పౌష్టికాహారం తీసుకుంటే వ్యాధిని నివారించవచ్చన్నారు. రోగ లక్షణాలున్న వారిని గుర్తించి, పరీక్షలు నిర్వహించి, రోగ నిర్ధారణ తరువాత పూర్తి వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. క్షయ వ్యాధి నివారణకు ఆరోగ్య కేంద్రంలో మెరుగైన చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ ఇ.సూర్యనారాయణ, స్థానికులు శరగడం అరుణ్ కుమార్, జగన్, మళ్ల కనకరాజు, సంతోష్, కుమార్ రాజా, మణి, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పబ్లిక్ పార్కుకు ఫీజు వసూలు

సీనియర్ సిటిజన్ల అసంతృప్తి



90వ వార్డులో సీతారామరాజు నగర్ పార్కు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం సీతారామరాజు నగర్‌లో జీవీఎంసీ నిధులతో అభివృద్ధి చేసిన పార్కుకు వచ్చిన సందర్శకుల నుంచి ఫీజు వసూలు చేస్తుండటంపై పలువురు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గురువారం పరిసర కాలనీలకు చెందిన సీనియర్ సిటిజన్లు ఈ పార్కును సందర్శించగా.. డబ్బులు చెల్లిస్తేనే ప్రవేశం ఉంటుందని అక్కడి సిబ్బంది వారిని అడ్డుకున్నారు. దీనిపై సీనియర్ సిటిజన్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసి, సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. పబ్లిక్ పార్కుకు ఎందుకు డబ్బులు వసూలు చేస్తున్నారని ప్రశ్నించారు. డబ్బులు వసూలు చేసేందుకు జీవీఎంసీ నుంచి అనుమతులేమైనా ఉన్నాయా..? అని నిలదీశారు. రూ.100 కట్టి కార్డు తీసుకుంటేనే పార్కులోకి పంపిస్తామని, లేకుంటే కుదరని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో పలువురు సీనియర్ సిటిజన్లు వెనుదిరిగిపోయారు. దీనిపై ఇటీవల కొంతమంది ఎమ్మెల్యే గణబాబుకు కూడా ఫిర్యాదు చేశారు. కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో పార్కు సందర్శకుల నుంచి డబ్బులు వసూలు చేస్తూనే ఉన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా, పార్కులో డబ్బులు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు వచ్చినా.. జీవీఎంసీ అధికారులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

శ్మశానవాటిక అభివృద్ధి చేయాలని ఆందోళన



నిరసన వ్యక్తం చేస్తున్న బీఎస్పీ నాయకులు

కంచరపాలెం: కాన్వెంట్ కూడలిలోని శ్మశాన వాటికను బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర జోనల్ ఇన్‌చార్జి పెదపెంకి శివప్రసాద్ నేతృత్వంలో బీఎస్పీ జిల్లా కమిటీ సభ్యులు గురువారం సందర్శించారు. పారిశుధ్య లోపం, రక్షణ గోడలు శిథిలావస్థకు చేరుకోవడం, ప్రవేశద్వారం అధ్వానంగా ఉండడం వంటి సమస్యలు గుర్తించారు. వాటిని కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. అధికారులు పర్యటించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ముందుగా శ్మశాన వాటికలో గల శానిటరీ కార్యాలయం వద్ద నాయకులు, కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బి.విశ్వనాథం, రామచంద్రరావు, పెద్దాడ కనకమహాలక్ష్మి, ధనుంజయరావు, రమేష్, అప్పారావు, ముచ్చుపల్లి రాంబాబు, కోటి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

మద్రిపాలెం: జోన్–2 ఎస్ఎస్‌టీఎల్ సెక్షన్ పరిధిలోని కాకానినగర్, ఎన్ఏడీ, మాధవధార ఫీడర్ల నిర్వహణ పనుల్లో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సాకేతపురం, రెల్లి వీధి, వినోద్‌నగర్, విమాన్‌నగర్, కాకానినగర్, ఎస్‌వీకే నగర్, ఎన్ఏడీ, పంజాబీ దాబా ఏరియా, ఐఎన్ఎస్ డేగా ఏరియా, ఆర్‌టీవో ఆఫీస్ రోడ్డు, సచివాలయం ఏరియా, ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్ ఏరియా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఈఈ కోరారు.

విద్యా ప్రమాణాల సాధనకు కృషి



విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలిస్తున్న కో ఆర్డినేటర్ చంద్రశేఖర్

మురళీనగర్: ప్రాథమిక పాఠశాలల్లో విద్యా ప్రమాణాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సర్వ శిక్ష జిల్లా అడిషనల్ కో ఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్ సూచించారు. 49వ వార్డు ఏఎస్సార్ నగర్‌లోని బర్మా కాలనీ ఆదర్శ ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో కనీస అభ్యసన స్థాయిలు సాధించేందుకు నిర్దేశించిన ప్రణాళిక తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. ప్రాథమిక స్థాయిలో విద్యా ప్రమాణాలు సాధించినప్పుడే ఉన్నత విద్యలో రాణించగలుతారన్నారు. తరగతి గదుల్లో నిర్వహిస్తున్న బోధనాభ్యసన విధానాలను పరిశీలించారు. ఒకటి నుంచి ఐదు తరగతుల విద్యార్థుల అభ్యసన స్థాయి, వర్క్‌బుక్స్, మౌఖిక పరీక్షలను పరిశీలించారు. ఆయన అడిగిన ప్రశ్నలకు విద్యార్థులు సమాధాలు ఇవ్వడంతో లెర్నింగ్ అవుట్ కమ్స్‌పై సంతృప్తి వ్యక్తం చేశారు. తరగతి గదుల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ కిట్ల పంపిణీపై ఆరా తీశారు. ప్రతి విద్యార్థి మధ్యాహ్న భోజనం తినేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని కె.వసంతకుమారి, ఉపాధ్యాయులు లక్ష్మి, ఆనంద్, గౌతమి, అఖిల్, నరేష్, రజని, గౌరి తదితరులు పాల్గొన్నారు.

పంప్ హౌస్ స్థలంపై కన్ను

- రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పేరుతో కబ్జాకు ఎత్తుగడ
- ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు యత్నం
- శంకుస్థాపనను అడ్డుకున్న మహిళలు
- కమ్యూనిటీ హాల్ నిర్మించాలని డిమాండ్



సామాజిక భవనం నిర్మించాలని పంప్ హౌస్ స్థలంలో ఆందోళన చేస్తున్న మహిళలు

గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డు బాజి జంక్షన్ తాటిపూడి పైప్‌లైన్ రోడ్డులోని పంప్ హౌస్ స్థలంపై కొందరి కన్నుపడింది. ఇంటింటికీ కుళాయిలు వచ్చాక ఈ పంప్ హౌస్ ఉపయోగం లేకపోవడంతో శిథిలమైంది. ఈ స్థలంలో మహిళా మండలి సభ్యులకు, స్థానికులకు ఉపయోగపడేలా సామాజిక భవనం నిర్మించాలని 20 ఏళ్లుగా స్థానికులు కోరుతున్నారు. దీనిపై నాయకులు ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి.. దాట వేస్తూనే ఉన్నారు. గత ఎన్నికల ముందు శిథిలావస్థలో ఉన్న పంప్ హౌస్ నిర్మాణాన్ని తొలగించేశారు. ఇపుడు ఇది చదునుగా.. కబ్జాకు అనువుగా ఉండటంతో దీనిపై కొందరి స్థానికుల కళ్లుపడ్డాయని, సొంతం చేసుకునేందుకు ప్రత్యేకంగా స్కెచ్ వేశారని ఇక్కడి మహిళలు ఆరోపిస్తున్నారు. వీరాంజనేయ స్వామి బాజి జంక్షన్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పేరుతో ఆర్వో వాటర్ ప్లాంట్ పెట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారని చెబుతున్నారు. గురువారం ఉదయం కొంత మందితో వచ్చి పంప్ హౌస్ స్థలంలో శంకుస్థాపన చేసేందుకు యత్నించారు. వారిని మహిళా సంఘాల సభ్యులు, స్థానికులు అడ్డుకున్నారు. ఎన్నాళ్ల నుంచో కమ్యూనిటీ హాల్ కోసం ఈ స్థలాన్ని అట్టిపెట్టుకుని ఉన్నామని, ఇపుడు కొంత మంది స్వార్థానికి ఈ స్థలం ఎలా ఇస్తామని అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

కమ్యూనిటీ హాల్ కోసం పోరాటం

స్థల వివాదం జరుగుతున్న విషయం తెలుసుకున్న స్థానిక టీడీపీ నాయకుడు యలమంచి ప్రసాద్ అక్కడికి వచ్చి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అసోసియేషన్ తరపున కొందరు వ్యక్తులు ఎమ్మెల్యేను కలిశారని, స్థానిక మహిళలు అభ్యంతరం చెబుతారని తెలిపినా.. వీరు శంకుస్థాపన చేసేందుకు యత్నించారని వివరించారు. స్థానిక మహిళలు ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాలని ఆయన సలహా ఇచ్చారు. గతం నుంచి ఈ స్థలం కబ్జాకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనిలో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని జోనల్ కమిషనర్‌కు అర్జీ పెట్టుకున్నామని మహిళలు చెబుతున్నారు. అధికారులు స్పందించలేదని వాపోతున్నారు. పంప్ హౌస్ స్థలంలో కమ్యూనిటీ హాల్ నిర్మించాల్సిందేనని బాజి జంక్షన్–3 ఎస్ఎల్ఎఫ్ రెడ్డి వీధి ప్రాంత 23 మహిళా సంఘాల సభ్యులు పట్టు వదలకుండా పోరాడుతున్నారు.

కమిషనర్ లీజుకిచ్చారట..

ఇక్కడి ప్రభుత్వ స్థలాన్ని జీవీఎంసీ కమిషనర్ లీజుకిచ్చారని కొందరు స్థానికులు చెబుతూ కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని స్థానిక మహిళలు ఆరోపిస్తున్నారు. పేరు, వివరాలు, రిజిస్ట్రేషన్ నంబర్లు ఏమీ లేకుండా రాత్రికి రాత్రే ఇక్కడ అసోసియేషన్ ఏర్పాటు చేసి.. ఉదయాన్నే శంకుస్థాపనకు పూనుకోవడం కబ్జా చేసే యత్నంగా ఉందంటున్నారు. వీరిపై అధికారులు తగు చర్యలు తీసుకోవాలని, పంప్ హౌస్ స్థలంలో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కోరుతున్నారు. ఇది సాధించే వరకూ తమ పోరాటం ఆగదని మహిళలు చెబుతున్నారు.

ఎన్నో ఏళ్ల నుంచి కాపాడుతున్నాం



ఎన్నో ఏళ్ల నుంచి ఈ స్థలాన్ని కాపాడుకుంటూ వస్తున్నాం. స్థానికుల సమావేశాలకు, మహిళల శిక్షణలకు ఉపయోగపడేలా సామాజిక భవనం నిర్మించాలి. అధికారులు, నాయకుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నాం. హామీలిచ్చినా కార్యరూపం దాల్చలేదు. ఈ స్థలం కబ్జాకు గురికాక ముందే భవనం నిర్మించాలి.

– దేరెడ్ల భాగ్యలక్ష్మి, బాజి జంక్షన్

సామాజిక భవనం అవసరం



సమావేశాలకు వేదిక లేక మహిళా సంఘాల సభ్యులంతా ఇబ్బందులు పడుతున్నాం. ఎవరి ఇంట్లోనో, మేడలపైనో మీటింగ్‌లు పెట్టుకుంటున్నాం. నాయకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. మా ప్రాంతంలో ఉన్న స్థలాన్ని కూడా కబ్జా చేసేందుకు యత్నించడం దారుణం. మా కోసం కమ్యూనిటీ హాల్ నిర్మించండి.

– బోదారి లక్ష్మీదేవి, స్థానికురాలు

ద్వారకా బస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ



ఆర్టీసీ అధికారి అప్పలనాయుడుతో మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

డాబాగార్డెన్స్: కలెక్టర్ ఎంఎన్ హరేందిరప్రసాద్ గురువారం ద్వారకా బస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ రూట్లలో తిరుగుతున్న బస్సుల సమయపాలన, సమాచార పట్టిక, టాయ్‌లెట్ల నిర్వహణ, శుభ్రత, టికెట్ బుకింగ్ కౌంటర్లు, ప్రయాణికులకు సంబంధించి కుర్చీలు, లైట్లు, ఫ్యాన్లు, మంచినీటి సదుపాయం నిశితంగా తనిఖీ చేశారు. బస్ కాంప్లెక్స్‌లో సీసీటీవీల పనితీరు పరిశీలించారు. బస్సుల్లో శుభ్రత, ప్రయాణికుల పట్ల ఉద్యోగుల ప్రవర్తన ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగులు ప్రయాణికుల పట్ల మర్యాదపూర్వకంగా మెలుగుతూ సేవలందించాలని, ఏసీ బస్సుల పరదాలు ఎప్పటికప్పుడు మార్చాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ పద్మావతి, సెక్యూరిటీ ఆఫీసర్ ఐవీవీపీ దుర్గాప్రసాద్, అసిస్టెంట్ మేనేజర్ నాయుడు, అధికారులు, సూపర్‌వైజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'సింహాద్రి థర్మల్ ప్లాంట్'ను సందర్శించిన డీఆర్ఎం



ప్లాంట్‌లో పర్యటిస్తున్న డీఆర్ఎం లలిత్ బోహ్రా, అధికారులు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా గురువారం సింహాద్రి సూపర్ థర్మల్ పవర్ ప్లాంట్ (ఎన్‌టీపీసీ)ని సందర్శించారు. ఈ ప్రాంతంలోని రైల్వే సైడింగ్, ఇతర కార్యాలయాల్లో తనిఖీలు చేశారు. రైల్వే సైడింగ్‌లో ర్యాక్‌ల నిర్వహణ, ర్యాక్‌ల రాకపోకల విషయంలో భద్రతా ప్రమాణాలపై అధికారులతో చర్చించారు. ఎన్‌టీపీసీ ప్రాంగణంలో రైళ్ల నిర్వహణను పరిశీలించారు. అనంతరం ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్‌శర్మ, ఇతర ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఎన్టీపీసీ సమీపంలోని జగ్గయ్యపాలెం లెవెల్ క్రాసింగ్ వద్ద భద్రతా విధానాలను డీఆర్ఎం పరిశీలించారు.

జర్నలిస్టులు సమాజ సంక్షేమానికి పాటుపడాలి



వార్షికోత్సవంలో పాల్గొన్న పారిశ్రామిక ప్రాంత జర్నలిస్టులు

మల్కాపురం: ఏ ఒక్క జర్నలిస్టుకు కష్టం వచ్చినా మిగిలిన జర్నలిస్టులంతా సాయంగా నిలవాలని సీనియర్ పాత్రికేయుడు, కళారత్న సుంకర చలపతిరావు అన్నారు. పారిశ్రామిక ప్రాంత జర్నలిస్టుల సంక్షేమ సంఘం తొలి వార్షికోత్సవం సందర్భంగా 58వ వార్డు పిలకవానిపాలెం వద్ద గల వైష్ణవి ఫంక్షన్ హాల్లో గురువారం తొలి వార్షికోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన చలపతిరావు మాట్లాడుతూ సమాజంలో చీకటి కోణాలను వెలికి తీసే క్రమంలో జర్నలిస్టులు అనుకోకుండా ఎటువంటి ఇబ్బందుల్లో పడినా మేమున్నాం అంటూ తోటి జర్నలిస్టులు అండగా నిలవాలన్నారు. కుటుంబ క్షేమం చూసుకుంటూ ప్రజలకు మంచి జరిగే వార్తలను ప్రచురిస్తూ జర్నలిస్టులు ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ముప్పిడి వెంకటగిరి, రాజుయాదవ్, నూనెల, కుమార్, డి.శ్రీను, దుర్గాప్రసాద్, రాజేష్, మూర్తి, హరి నూనెల తదితరులు పాల్గొన్నారు.

సిరులతల్లికి భక్తుల పూజలు



శ్రావణలక్ష్మి పూజలో పాల్గొన్న భక్తులు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రీలక్ష్మి పూజలు గురువారం 7వ రోజుకు చేరాయి. కార్యక్రమంలో ఆలయ ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం..

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. కార్యక్రమంలో ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు సువర్ణ వస్త్రాలంకరణలో కన్యకాపరమేశ్వరి దర్శనం..

శ్రావణ మాసం రెండో శుక్రవారాన్ని పురస్కరించుకుని కురుపాం మార్కెట్ సమీపాన వేంచేసిన కన్యకాపరమేశ్వరి సువర్ణ వస్త్రాలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఉదయం 5 నుంచి 7 గంటల వరకు అమ్మవారి మూలవిరాట్‌కు క్షీరాభిషేకం, 8 గంటలకు ప్రత్యేక పూజలు జరపనున్నారు. 10 గంటలకు మహిళలచే సామూహిక లలితా సహస్ర నామ పారాయణ, 10.30 గంటలకు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించనున్నారు.